క్లుప్తంగా

కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ ఎస్సీ విభాగం ఇన్‌చార్జ్‌గా అశోక్

హన్మకొండ: కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ ఎస్సీ విభాగం ఇన్‌చార్జ్‌గా జిల్లాలోని ఆత్మకూరు మండలం నీరుకుళ్లకు చెందిన అర్శం అశోక్‌ను నియమిస్తూ టీపీసీసీ ఎస్సీ విభాగం చైర్మన్ నగరిగారి ప్రీతం బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, తన నియామకానికి సహకరించిన నాయకులకు అశోక్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానని ఆయన అన్నారు.

కాంగ్రెస్ ఖమ్మం పార్లమెంట్ ఎస్సీ సెల్ ఇన్‌చార్జ్‌గా భద్రయ్య

హసన్‌పర్తి: కాంగ్రెస్ ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా హసన్‌పర్తి మండలం పెంబర్తికి చెందిన రాజాభద్రయ్య నియమితులయ్యారు. ఈమేరకు ఎస్సీ సెల్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర చైర్మన్ ప్రీతమ్ ప్రకటించారు. భద్రయ్యకు వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ నియామక పత్రాన్ని బుధవారం అందించారు. కాగా, తన నియామకానికి సహకరించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్‌ఎస్‌వీ కమిటీ ఎన్నిక

విద్యారణ్యపురి: హనుమకొండలోని 10వ డివిజన్ బీఆర్‌ఎస్‌వీ నూతన కమిటీని నియమించినట్లు బీఆర్‌ఎస్‌వీ కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ బుధవారం తెలిపారు. ఇన్‌చార్జ్‌గా మహ్మద్ ఫిరోజ్‌ఖాన్, అధ్యక్షుడిగా సుమాన్‌ఖాన్, కార్యవర్గ సభ్యులను నియమించినట్లు వివరించారు. ఈ సమావేశంలో బాధ్యులు ఖలీల్, వస్తం అనిల్, షాయబ్, ఉమెర్, పిట్టల కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి దేవాలయంలో మినరల్ వాటర్ ప్లాంట్ల ఏర్పాటు



హన్మకొండ కల్చరల్: హైదరాబాద్‌కు చెందిన దివీస్ లాబోరేటరీస్ సహకారంతో రెండు మినరల్ వాటర్ ప్లాంట్లను భద్రకాళి దేవాలయంలో ఏర్పాటు చేశారు. ఈమేరకు దేవస్థానం పక్కన, పార్కింగ్ స్థలంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లను ఆలయ ఈఓ, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శేషుభారతి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో దేవాలయ అర్చకుడు శేషు, అర్చకులు, సిబ్బంది, దివీస్ లాబోరేటరీస్ ప్రతినిధులు శ్రీనివాస్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

హన్మకొండ అర్బన్: జీడబ్ల్యూఎంసీ రిటైర్డ్ డీఈ ఆకుల మనోహర్ తండ్రి ఆకుల నర్సయ్య సంవత్సరీక కార్యక్రమం నగరంలోని తారా గార్డెన్‌లో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి మున్నూరుకాపు సంఘం నాయకులు హాజరై నర్సయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా మున్నూరుకాపు సంఘం పశ్చిమ కోఆర్డినేటర్ కనుకుంట్ల రవికుమార్, మున్నూరుకాపు సంఘం పద్మాక్షి రోడ్డు పరపతి సంఘం అధ్యక్షుడు మెరుకుల మనోహర్, నాయకులు అంబటి కుమారస్వామి, తోట ప్రకాశ్, బొల్లం అశోక్, ప్రభాకర్, ములుగు జిల్లా మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు పైడాకుల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సంఘం వ్యవస్థాపకుడు ధనుంజయ మృతి

హన్మకొండ: ఉమ్మడి వరంగల్ జిల్లా ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక సభ్యుడు, మాజీ అధ్యక్షుడు కేవీ ధనుంజయ (76) హైదరాబాద్‌లో బుధవారం మృతి చెందారు. ఫొటోగ్రాఫర్ల సంక్షేమం కోసం 1976లో అప్పటి కలెక్టర్ సమరజిత్ చేతుల మీదుగా అసోసియేషన్‌ను స్థాపించినట్లు వరంగల్ జిల్లా ఫొటోగ్రాఫర్ల సంఘం నాయకులు తెలిపారు. వరంగల్‌లోని కృష్ణాకాలనీకి చెందిన ధనుంజయ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు పేర్కొన్నారు. ధనుంజయ మృతిపై సంతాపం ప్రకటిస్తూ ఆయన కుటుంబానికి సంఘం తరఫున రూ.60 వేల ఆర్థిక సాయం అందజేసినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గాదె లింగమూర్తి తెలిపారు.

తాళ్ల పద్మావతిలో స్వయం ప్రతిపత్తి వేడుకలు



కాజీపేట: కాజీపేట మండలం సోమిడి శివారులోని తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాలకు యూజీసీ బుధవారం స్వయం ప్రతిపత్తిని మంజూరు చేసింది. దాంతో కళాశాల ఆధ్యాపకులతో కలిసి చైర్మన్ తాళ్ల మల్లేశం కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కళాశాలకు స్వయం ప్రతిపత్తి మంజూరు చేయడం ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ తాళ్ల చైతన్య, వంశీ, ప్రిన్సిపాల్ డాక్టర్ వేలు, డాక్టర్ విజయలక్ష్మి, మహేందర్ రెడ్డి, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మాయమాటలు నమ్మి మోసపోవొద్దు



మడికొండలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న అరూరి రమేష్



హసన్‌పర్తి: కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రమేష్

- బీఆర్‌ఎస్ వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేష్

మడికొండ: మాయమాటలు చెప్పే ప్రతిపక్ష పార్టీల మాటలు నమ్మి మోసపోవొద్దని బీఆర్‌ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి అరూరి రమేష్ ఓటర్లకు సూచించారు. 46, 64వ డివిజన్లలోని టేకులగూడెం, మడికొండ గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. మడికొండలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి అక్రమంగా రూ.వేల కోట్లు సంపాదించాడని, అడ్డదారిలో బీఫాం తెచ్చుకున్నాడని ఆరోపించారు. ఎల్లప్పుడు అందుబాటులో ఉండి, ఆపదలో ఆదుకునే తనను ఆదరించి గెలిపించాలని కోరారు. డంపింగ్ యార్డు ప్రధాన సమస్యను తీర్చేందుకు జర్మనీ సంస్థతో ఒప్పందం జరిగినట్లు చెప్పారు. త్వరలోనే డంపింగ్ యార్డులోని చెత్తను రీసైక్లింగ్ ద్వారా తొలగించి పార్కుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా రైతు బంధు అధ్యక్షురాలు లలితాయాదవ్, మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్లు రాధికరెడ్డి, సరోజన, వినోద్, దువ్వ శ్రీకాంత్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

హసన్‌పర్తి : 65వ డివిజన్ చింతగట్టుకు చెందిన వివిధ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు, నాయకులు బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి పార్టీ అభ్యర్థి అరూరి రమేష్ ఆహ్వానించారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలో పొందుపరిచిన పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో రైతు రుణవిమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకన్న, రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎల్లావుల లలితాయాదవ్, కార్పొరేటర్ దివ్యారాణి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లారెడ్డి, పాల్గొన్నారు.

అరూరి గెలుపు కోరుతూ ప్రచారం

అరూరి రమేష్ గెలుపు కోరుతూ బుధవారం ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. హసన్‌పర్తి, ముచ్చర్ల, మంత్రపురికాలనీ, భీమారం, కోమటిపల్లి, దేవన్నపేట, వంగపహాడ్, గోపాలపురం, అన్నాసాగరం గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేశారు. కార్పొరేటర్లు జక్కుల రజిత, సునీల్‌కుమార్, సురేందర్‌రెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

కేవీ విద్యార్థుల క్షేత్రస్థాయి సందర్శన



క్షేత్రస్థాయి సందర్శనలో విద్యార్థులు

కాజీపేట అర్బన్: క్షేత్రస్థాయి సందర్శనలో భాగంగా కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని కేంద్రీయ విద్యాలయ పాఠశాల విద్యార్థులు మామునూరులోని వెటర్నరీ సైన్స్ కళాశాలను బుధవారం సందర్శించారు. కేవీ పీఎం శ్రీ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అన్ని విషయాలపై అవగాహన కల్పించేందుకు వెటర్నరీ సైన్స్ సందర్శనకు తీసుకెళ్లినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సుభాషిణి తెలిపారు. పాఠశాలకు చెందిన 6, 7, 8వ తరగతులకు చెందిన సుమారు 210 మంది విద్యార్థులు క్షేత్రస్థాయి సందర్శనకు హాజరైనట్లు చెప్పారు. జంతువుల్లో ఏర్పడే వైరస్‌లు, బ్యాక్టీరియాలు, డెయిరీ, పౌల్ట్రీల నిర్వహణ, గొర్రెల పెంపకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పురుషోత్తం మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు కలిగి ఉండాలని, ఉన్నత చదువులు చదవాలని సూచించారు. నైతిక విలువలు కలిగి సమాజంలో ఉత్తమ పౌరులుగా తయారుకావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కేవీ ఉపాధ్యాయులు తౌటం శ్రీనివాస్, స్మిత, అఖిల్, శ్రీనివాస్, శిల్ప, పూజ, తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధిని మరిచిన పార్టీలు



దళిత్ మేనిఫెస్టో విడుదల చేస్తున్న నాయకులు

హన్మకొండ: దళితుల అభివృద్ధి, సంక్షేమం, రక్షణను ఎన్నికల హామీల్లో మరిచిన పార్టీలను ఓడించాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి పీ.శంకర్ పిలుపునిచ్చారు. హనుమకొండలో ఈమేరకు దళిత్ మేనిఫెస్టోను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దళితుల స్థితిగతుల అధ్యాయనానికి ఎస్సీ కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు. తరతరాలుగా కుల వివక్ష, అణచివేత, దోపిడీ, పీడనలకు గురవుతూ నాణ్యమైన విద్య, ఉద్యోగం, వైద్యానికి, భూమి, ఉపాధి, సంపదకు, రాజకీయ ప్రాతినిధ్యానికి దూరంగా ఉంటున్న దళితుల సంక్షేమం, అభివృద్ధి, రక్షణకు, దళిత సాధికారత సాధించేందుకు రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. మహనీయులైన బుద్ధుడు, పూలే, సావిత్రీబాయి, అంబేడ్కర్ ఆలోచనలను ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కేయూ జేఏసీ చైర్మన్ డాక్టర్ మంద వీరస్వామి, డీబీఎఫ్ కార్యదర్శులు చుంచు రాజేందర్, పులి కల్పన, జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, రాజు, కిరణ్, మహేందర్ పాల్గొన్నారు.

తూర్పు, పశ్చిమ బరిలోని అభ్యర్థులు వీరే

వరంగల్ అర్బన్: వరంగల్ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ బుధవారం ముగిసింది. ఈమేరకు 29 మంది అభ్యర్థులు పోటీలో నిలువగా, అందులో స్వతంత్ర అభ్యర్థులే అధిక సంఖ్యలో ఉన్నారు. ఈమేరకు గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయంలో కమిషనర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి షేక్ రిజ్వాన్ బాషా వివరాలు వెల్లడించారు.

ఇద్దరు అభ్యర్థుల ఉపసంహరణ

స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన రాజనాల శ్రీహరి, ఇండిపెండెంట్ అభ్యర్థి ఆడెపు నగేష్ తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో ప్రతిబూత్‌లో రెండు ఈవీఎంలలో గుర్తులు కేటాయించాల్సి వస్తోంది.

ఎన్నికల సంఘం నిబంధనల మేరకే గుర్తులను కేటాయించినట్లు వరంగల్ (తూర్పు) రిటర్నింగ్ అధికారి షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన అనంతరం బల్దియా ప్రధాన కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి చాంబర్‌లో అభ్యర్థులకు గుర్తులను రిటర్నింగ్ అధికారి కేటాయించారు.

తూర్పు బరిలో నిలిచిన అభ్యర్థులు

ఎర్రబెల్లి ప్రదీప్‌రావు (బీజేపీ), కొండా సురేఖ (కాంగ్రెస్), సీ.పుష్పిత (బీఎస్పీ), నన్నపునేని నరేందర్ (బీఆర్‌ఎస్), ఇజ్జగిరి కమలాకర్ (విద్యార్థుల రాజకీయ పార్టీ), సుంచు జగదీశ్వర్ (ఎంసీపీఐ(యూ)), పనికెల శ్రీనివాస్ (న్యూ ఇండియా పార్టీ), వావిలాల రాజేందర్ (భారతీయ స్వదేశీ కాంగ్రెస్), కేడల ప్రసాద్ (ధర్మ సమాజ్ పార్టీ), కొటం రవీందర్ (అలయన్స్ డెమోక్రసీ రిఫామ్స్ పార్టీ) బరిలో నిలిచారు.

స్వతంత్ర అభ్యర్థులు: కే.రవి, ప్రమీల జన్ను, సంధ్ర జాన్సన్, రంగరాజు రవీందర్, బొల్ల రామకృష్ణ, పాలకొండ మల్లేశ్వరి, పబ్బా బానులక్ష్మణ్, ఆకుల వెంకట్, ఎదులాపురం కార్తీక్, పోలెపాక చంద్రకళ, తోట లింగమూర్తి, చింతాల అనిల్, సాదా ప్రదీప్, శ్వేత జోగు, కుడికాల రాధాకృష్ణ, వన్నాల శ్రీనివాస్, జన్ను పరంజ్యోతి , పీ.శ్రీకాంత్, కే.రంజిత్ కుమార్

పశ్చిమ బరిలో 15 మంది

హన్మకొండ అర్బన్: వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో 15 మంది అభ్యర్థులున్నారు. అయితే గతానికంటే అభ్యర్థులు తక్కువగా ఉండడంతో పనిభారం తప్పిందని అధికారులు అంటున్నారు.

పోటీలో పార్టీల అభ్యర్థులు

దాస్యం వినయ్‌భాస్కర్ (బీఆర్‌ఎస్), నాయిని రాజేందర్‌రెడ్డి (కాంగ్రెస్), మాదారపు రవికుమార్ (బీఎస్పీ), రావు పద్మ (బీజేపీ), అల్లిపురం వేణుచారి (టీడీపీపీ), కోగిల రూప (ధర్మ సమాజ్ పార్టీ), గడ్డం నాగార్జున (ఎంసీపీఐ(యూ)), యుగంధర్‌గౌడ్ (ఏడీఆర్పీ), షాజీహమీర్ (ఆజాద్ సమాజ్ పార్టీ)

స్వతంత్ర అభ్యర్థులు

మహ్మద్ ఖలీలుద్దీన్, కృష్ణ, గుజ్జుల శ్రీనివాస్‌రెడ్డి, గుర్రం జక్కయ్య, బొమ్మగాని భార్గవ్, సత్యప్రకాష్

ఉపసంహరించుకున్న వారు

బుధవారం మొత్తం ఐదుగురు అభ్యర్థులు తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. వారిలో ఫార్వర్డ్ బ్లాక్ నుంచి జంగా రాఘవరెడ్డి, ఇతరులు ఇమ్మడి రవి, ఉల్లెంగాల యాదగిరి, జన్ను మధు, సీతారాజ్‌కుమార్ ఉన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



బాలల దినోత్సవంలో పాల్గొన్న జిల్లా మహిళా సాధికారత మిషన్ కోఆర్డినేటర్ పావని

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు శారదాబాయి ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా మహిళా సాధికారత కేంద్రం మిషన్ కోఆర్డినేటర్ పావని హాజరై బేటీ బచావో – బేటీ పడావో ప్రచార ఫ్లెక్సీని ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు బాలల విశిష్టతను వివరిస్తూ వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం, విజేతలకు పావని బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రమాదేవి, ఉపాధ్యాయులు వీర ఉపేందర్, రవీందర్, నఫీజ్, అహ్మద్‌ఖాన్, తస్నీమ్ ఆరా, హాజీపాషా, ఇందిర, వెంకన్న, రామస్వామి, లకుపతి తదితరులు పాల్గొన్నారు.

బధిరుల పాఠశాలలో..



వివిధ వేషధారణలో విద్యార్థులు

హన్మకొండ అర్బన్: టీటీడీ దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవేంకటేశ్వర బధిరుల పాఠశాలలో బాలల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ చలపతిరావు, ఐఈడీ కోఆర్డినేటర్ రాధ హాజరైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జే.లక్ష్మీ నర్సమ్మ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, డ్యాన్స్, స్కిట్, మైండ్ గేమ్స్ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. విజేతలకు అతిథులు బహుమతులు ప్రదానం చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వంగపహాడ్ పాఠశాలలో..



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

హసన్‌పర్తి: బాలల దినోత్సవాన్ని పురస్కరించుని వంగపహాడ్ ప్రాథమిక పాఠశాలలో రైజింగ్ స్టార్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆలేటి రజనీకాంత్, కోశాధికారి పల్లెబోయిన భరత్, సోషల్ మీడియా మేనేజర్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ఆకాశ దీపోత్సవం

కాజీపేట: కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని చైతన్యపురి కాలనీలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం ఆకాశ దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ధ్వజస్తంభం ఎదుట ఆకాశ దీపోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు రఘురామాచార్యులు ఎగురవేయగా, భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

బాధిత మహిళలకు అండగా ‘సఖి’



మాట్లాడుతున్న కేస్ వర్కర్ వినీల

హన్మకొండ: వరకట్నం, లైంగిక, గర్భవిచ్ఛిత్తి వంటి వేధింపులతో కుంగిపోతున్న మహిళలు, బాలికలకు రక్షణ కల్పించి, న్యాయం అందేలా కృషి చేస్తూ, బాధితులకు సఖి వన్‌స్టాప్ సెంటర్ అండగా ఉంటోందని కేస్ వర్కర్ వినీల అన్నారు. హనుమకొండ 4వ డివిజన్ యాదవనగర్‌లోని బాసిత్‌నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు సామాజిక స్థితిగతులపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యలతో బాధపడే బాలికలు, మహిళలు 0870 – 2452112, 181 నంబర్లకు కాల్‌చేసి తక్షణ రక్షణ పొందాలని సూచించారు. మహిళా శిశు, సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, ఐసీపీఎస్ సోషల్ వర్కర్ స్వర్ణ, లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి నిరోధకుడు వినయ్‌భాస్కర్



మాట్లాడుతున్న బక్క జడ్సన్

హన్మకొండ: వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి నిరోధకుడు ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అని కాంగ్రెస్ నేత, ఏపీ వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ బక్క జడ్సన్ ఆరోపించారు. హనుమకొండ సర్క్యూట్‌హౌస్ రోడ్డులోని విశాల్ భవన్‌లో బుధవారం రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్‌ఎస్ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్‌పై చార్జ్‌షీట్ విడుదల చేశారు. అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జడ్సన్ మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావానికి ముందు ఉద్యమ సమయంలో అభివృద్ధి చేయలేక పోయానని చెప్పిన వినయ్‌భాస్కర్.. అనంతరం రెండు పర్యాయాలు ఎన్నికైనా అభివృద్ధి ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉందని ఎద్దేవాచేశారు. కాజీపేట బస్టాండ్, బస్సు డిపో నిర్మాణానికి 29 రోజులపాటు రిలే నిరాహార దీక్షలు, మూడు రోజులు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరవధిక నిరాహార దీక్ష చేసి ఆనాడు అప్పటి దేశ ప్రధాని పీవీ నరసింహారావు కుమారుడు, నాటి రాష్ట్ర మంత్రి పీవీ.రంగారావును ఓడించిన ప్రణయ్ భాస్కర్ లక్ష్యాలు.. నేటికీ నెరవేరలేదని అన్నారు. ఆయన సోదరుడిగా వినయ్‌భాస్కర్ చేసింది శూన్యమని విమర్శించారు. కాజీపేట రైల్వే టౌన్‌స్టేషన్, ఎన్ఐటీ (ఆర్ఈసీ), కేయూసీ, కేఎంసీ, ఎంజీఎం, కేంద్రీయ విద్యాలయాలు, బీసీ హాస్టల్, డిగ్రీ, జూనియర్ కళాశాలలన్నీ కాంగ్రెస్ హయాంలో ఏర్పాటు చేసినవేనని వివరించారు. సమావేశంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, జిల్లా అధికార ప్రతినిధి మహమ్మద్ అంకుష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్‌యాదవ్, నాయకులు శ్రీధర్ యాదవ్, జయకుమార్, చిన్న పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



కాజీపేటలో విభూది అలంకరణలో అయ్యప్ప



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అర్చకులు

కాజీపేట: కాజీపేట శ్రీధర్మశాస్త్ర హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో స్వామివారిని బుధవారం విభూదితో అభిషేకించారు. ఆలయ అర్చకుడు ఉడుతల శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో గణపతి హోమంతో పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. భక్తులు అందజేసిన విభూదితో అయ్యప్పకు అభిషేకం జరిపించి భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు. ఈ సందర్భంగా కార్తీక మాసంలో మాల ధారణతో కలిగే ఫలితాలపై అయ్యప్ప గురుస్వామి, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి బుర్ర జనార్దన్ భక్తులకు వివరించారు.

అయ్యప్ప పడిపూజ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

హన్మకొండ కల్చరల్: వరంగల్ భద్రకాళి రోడ్డులోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప భక్త సేవాశ్రమంలో డిసెంబర్ 6వ తేదీన అయ్యప్ప జన్మనక్షత్ర అష్టాభిషేకం, మహా పడిపూజ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు గణపతిశర్మ తెలిపారు. ఆశ్రమంలో నిర్వాహకుడు టీఆర్.బాల సుబ్రహ్మణ్యశర్మ అధ్యక్షతన బుధవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో మహోత్సవ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణపతిశర్మ మాట్లాడుతూ పూజా కార్యక్రమాల్లో ఆగమ సామ్రాట్ భద్రకాళి శేషు, శ్రీశంకర గురుకుల వేద పాఠశాల అధ్యాపకులు, వేద పండితులు నారాయణ ఘనాపాటి, వెంకటేశ్వరశర్మ ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని తెలిపారు. ప్రత్యేక పూజలు, అయ్యప్ప స్వామివారికి 18రకాల అభిషేకాలు జరుగుతాయని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

‘స్వీప్’ అవగాహన సదస్సులు



అవగాహన ర్యాలీలో ప్రతిజ్ఞ చేస్తున్న ఓటర్లు

వరంగల్: ఓటింగ్ శాతం పెంచడమే ధ్యేయంగా కలెక్టర్ ఆదేశాల మేరకు వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాల పరిధి డివిజన్లలోని శాకరాశికుంట, ఎన్టీఆర్‌నగర్, మురికివాడల్లో మెప్మా సిబ్బంది బుధవారం ఓటరు చైతన్యంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఓటు ప్రయోజనాలు, ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కలిగించారు. ర్యాలీల్లో స్వయం సహాయక మహిళా బృందాల సభ్యులు, స్థానిక మహిళలు, ప్రజలను భాగస్వాములను చేస్తూ ఓటు ప్రాధాన్యాన్ని వివరించినట్లు నోడల్ అధికారి బ్రజేష్ తెలిపారు. ఎస్‌వీఈఈపీ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్-స్వీప్) -2023లో భాగంగా ఓటరు ప్రచార రథంలోని ఈవీఎంల ద్వారా ఓటు వేసే విధానం, వేసిన ఓటు నిర్ధారణపై అవగాహన కలిగించినట్లు పేర్కొన్నారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న స్థానికులు, సిబ్బందితో అధికారులు ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో టీఎంసీ రమేష్, సీఓ రజిత తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

23న పీడీఎస్ బియ్యానికి వేలం

వరంగల్: జిల్లాలో స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యానికి కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాల మేరకు ఈనెల 23న బహిరంగ వేలం వేయనున్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ మండల స్థాయి గిడ్డంగి పరిధిలో 560.21 క్వింటాళ్లు, వర్ధన్నపేటలో 124.08 క్వింటాళ్లు, నర్సంపేటలో 1027.54 క్వింటాళ్ల బియ్యం వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయంలో ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్న వేలంలో అర్హులు పాల్గొనాలని కోరారు. రైస్ మిల్లర్లు, పీడీఎస్ కేసులు ఉన్న వారు అనర్హులని తెలిపారు. వేలంలో నిర్ణయించిన ప్రకారం (సరుకు విలువలో 10 శాతం) డీడీలు చెల్లించాలని చెప్పారు. ఆధార్, పాన్‌కార్డ్ ప్రతులను డీడీలతో సమర్పించాలని తెలిపారు.ఎక్కువకు పాడి అర్హత పొందిన వారికి కలెక్టర్ (పౌరసరఫరాల) ఉత్తర్వులకు లోబడి సరుకును స్వాధీన పరుస్తామని తెలిపారు. 48 గంటల్లోపు వేలంపాటకు సంబంధించిన మొత్తం డబ్బులు చెల్లించి సరుకును స్వాధీనం చేసుకోవాలని సూచించారు.

సంచార జాతులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

హన్మకొండ: ఎలాంటి గుర్తింపు లేకుండా అభివృద్ధికి ఆమడ దూరంలో విసిరివేయబడిన సంచార జాతుల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాజకీయ పార్టీలకు ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు విజ్ఞప్తి చేశారు. ఈ అంశాన్ని పార్టీల ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈమేరకు సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి రాసిన లేఖలను హనుమకొండ సుబేదారిలో ప్రజావేదిక ఆధ్వర్యంలో బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎంబీసీ, మైనారిటీలకు ఏర్పాటు చేసిన విధంగానే సంచార జాతులకు కూడా కార్పొరేషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరముందని వివరించారు. సంచార జాతులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, బడ్జెట్ కేటాయింపు దిశగా ఇప్పటి వరకు ఏ పార్టీ, ఏ ప్రభుత్వమూ ఆలోచించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. దాంతో సంచార జాతులు గుర్తింపునకు, అభివృద్ధికి నోచుకోలేదని వాపోయారు.

విద్యుత్ సమస్యల పరిష్కార సదస్సు

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ 33/11 కేవీ గొర్రెకుంట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సమస్యల పరిష్కార సదస్సును బుధవారం నిర్వహించారు. వరంగల్ సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎన్పీడీసీఎల్ (సీజీఆర్ఎఫ్–1) చైర్మన్ ఎన్వీ.గోపాలచారి, ఫైనాన్స్ మెంబర్ ఆర్.చరణ్‌దాస్, ఇండిపెండెంట్ మెంబర్ ఎన్.నరేందర్, ఎస్ఈ ఆపరేషన్ మధుసూదన్‌రావు, ఎస్ఏఓ సంజీవరావు, ఏడీఈ జీ.గణేశ్, ఏఏఓ గోపు కమలాకర్, టీ.మధుకర్, జ్యోతిర్మయి, రజనీకుమార్, తరుణ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కళాఉత్సవ్‌లో విజయ ప్రతిభ

కాశిబుగ్గ సెంటర్: హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి కళాఉత్సవ్ –2023 పోటీల్లో కరీమాబాద్ జీహెచ్‌ఎస్‌లో 9వ తరగతి చదువుతున్న జీ.విజయ ప్రతిభ కనబరిచింది. 2 –డీ విజువల్ ఆర్ట్స్ విభాగంలో గీసిన చిత్రానికి ద్వితీయ బహుమతి లభించింది. ఈమేరకు విజయకు రూ.వేయి నగదు బహుమతిని అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా విజయను డీఈఓ వాసంతి అభినందించి జిల్లాకు పేరు తీసుకురావడం గర్వకారణమని అని ప్రశంసించారు.

ఉచిత ఆక్యుపంక్చర్ వైద్యశిబిరం



మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

నయీంనగర్: ప్రపంచ ఆక్యుపంక్చర్ డే సందర్భంగా బుధవారం నుంచి మూడు రోజుల పాటు ఉచిత ఆక్యుపంక్చర్ వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు డాక్టర్ ఎస్.సుబ్రహ్మణ్యం తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆక్యుపంక్చర్ వైద్యం ద్వారా మెడ, నడుము, మోకాళ్ల నొప్పులతో పాటు పక్షవాతం, కీళ్లవాతం లాంటి అన్ని రకాల నొప్పులను నివారించవచ్చని వివరించారు. ఈ వైద్య విధానం ద్వారా శరీరంలోని శక్తి బిందువులను గుర్తించి రోగాలను నయం చేయవచ్చని తెలిపారు. కన్సల్టేషన్ కోసం లష్కర్ బజార్‌లోని క్లినిక్‌ను సంప్రదించాలని కోరారు.